27

# ఛత్రపాణి

**పా**ల సముద్రంలో శేషుడిమీద పడుకొన్న శ్రీమన్మహా విష్ణువుల వారికి ఆ శేషుడు గారే, తన పడగలు విప్పి గొడుగు పట్టిన బొమ్మలను మీరంతా చూసే వుంటారు. ఆ విష్ణువుగారే వామనావతారమెత్తి, బలిచక్రవర్తిని మూడడుగుల నేల దానమడిగినప్పుడు, ఓ చేత బుడ్డిచెంబు, మరో చేతి ఆతపత్రమూ ధరించిన ఆవటువును చూచిన బలిచక్రవర్తిగారూ- ఆ వచ్చినవాడు సాక్షాత్తూ విష్ణుమూర్తి అవతారమేనని గ్రహించినటువంటి వాడయి, వెంటనే వొప్పుకొని, పాతాళలోకానికి వెళ్ళిపోయాడు.

ఇటు ప్రాచ్యదేశాలనూ, అటు పాశ్చాత్య దేశాలనూ పరిపాలించిన వొకనాటి చక్రవర్తులు, మహాప్రభువులు, మహారాజులు, ఇంట్లో వున్నా వీధిలోకొచ్చినా, గొడుగుల్ని వదలలేదు. వదల్లేదంటే, వారే పట్టుకొనే వారని కాదు. ప్రభువులకు ఎండావానలు తగలకుండా, భృత్యకోటి ఛత్రాలను పడుతూ ఉండేవారు. అలా పట్టించుకోవడం రాను రాను అవసరం స్థాయినిమించి, అదో గౌరవం కిందికి మారిపోయింది. మారిపోయిందనడానికి గుర్తు ఈనాటికీ రాజ్యాధినేతలకు, మనం గొడుగులు పడుతూ ఉండడమే! ఆయనగారు ఆ దేశానికి అధ్యక్షుడో ప్రధానమంత్రిగారోననుకోండి; వారి వెనకనే కూచుని వారికి గొడుగు పట్టేవారుంటారు.

ఈ అలవాటు మంచి చెడ్డల మాటనలా వుంచితే, ఇది మనకు దేవతలనుంచి సంక్రమించిందని చెప్పుకోవచ్చు. మన గర్భగుళ్ళలోని దేవతా విగ్రహాలను వోసారి చూడండి. వివిధాలంకారాలతో పాటు చిన్న గొడుగు కూడా వారి నెత్తిమీద మెరుస్తూ ఉంటుంది.

స్వదేశ సంస్థానాలు రద్దు కాకముందు ప్రతి మహాప్రభువు దగ్గరా, కొందరు ఛత్రపాణు లుండేవారు. వారి పని ప్రభువులకు గొడుగులు పట్టడం. ఈ పని చేసినందుగ్గానూ వారికి భారీగా వేతనాలు, కానుకలు చెల్లించేవారు ప్రభువులు. కొందరు కొందరయితే మాన్యాలే యిచ్చేశారు- ఈ పని చేస్తున్నవారికి!

కటిక పేదలు, ఎండావానల నుండి రక్షణకోసం ఏ తాటియాకునో నెత్తిమీద వేసుకుంటే, కాస్త కలిగిన వారు తాటాకు గొడుగును వేసుకొనే వారు. అదే మహారాజులయితే, ముత్యాల గొడుగులు పట్టించుకొనేవారు.

అయితే-

ఈ చరిత్రకూ, మన శంకరయ్యకూ ఏమీ సంబంధంలేదు. అతనికిన్ని సంగతులు - గొడుగుల్ని గురించిన సంగతులు - తెలుసునో లేదో మనకు తెలీదు.

శంకరయ్యది అసలీ వృత్తి కాదు. అతని నాన్నగారూ, ఆ నాన్నగారి నాన్నగారూ ఓ 'చిన్న' రాజావారి దగ్గర పనిచేస్తుండేవారు. ఏంపనో, విశదంగా చెప్పడానికి శంకరయ్య నిరాకరించాడు. ఆ పనిలో వున్నంతకాలం, సంసారం బాగానే గడిచిందట.

"రాజుగారు, నాకూ బాగా గుర్తేనండీ! ఎర్రగా బొద బొదలాడుతూ ఉండేవారు. బొడ్డుకిందికి లాగు కట్టుకొనేవారు. అన్ని వేళ్ళకు మెరిసే వుంగరాలు. లంకంత లోగిలి, ఇంటినిండా పనివాళ్ళు.

రాజాగారు ఎప్పుడూ మద్రాసులో ఉండేవారు. ఎప్పుడన్నా ఇక్కడికొచ్చేవారు. అయిదారు గుర్రపు సార్టులు, నాలుగు కార్లు, వాటిల్లో దొరసానులు, బుడ్లు-'' అని నవ్వాడు శంకరయ్య.

మరకలతో, మసకేసి పోయిన ఫొటోలను చూపించాడు శంకరయ్య. రాజాగారికి వెనగ్గారెండో వరుసలో ఉన్న నాలుగో మనిషి, మన శంకరయ్యగారి తండ్రి. రాజాగారికి, అటూ, ఇటూ దొరసానులూ, వారికి పక్కగా దొరలూ, వారి ముందు చచ్చిపడి వున్న పెద్దపులి. ఆ పులిమీదుగా వో పొడవైన తుపాకి-

''ఇప్పుడు రాజాగారు లేరండి. ఈ మధ్యనే చచ్చిపొయ్యారు. ఆయన బతికుండగానే రాజరికం పోయిందండి. రెండేళ్ల కిందటి దాకా, దివాణం దివాణంగానే వుందండి. తరువాత, రాజాగారు దాన్ని పడగొట్టి అక్కడ వోటేలు కట్టిస్తున్నారండి. అదింకా పూర్తికాక ముందే అయ్యగారు వెళ్ళిపోయారండీ.''

సారాంశమేమిటంటే రాజాగారు వున్నంతకాలం - ఆయన దివానంలోనే, 'రాజా'లాగా వెలిగిపోయిన సత్తిరాజుగారి కుటుంబం, ఆ తరువాత కూటికీ, గుడ్డకూ, నానా యాతనలూ అనుభవించింది. కొంతకాలం పాటు 'ఔటు హవుస్'లో వున్నా, దాన్నీ హోటల్ కోసం పడగొట్టేశారు. దాంతో వీధిన పడక తప్పిందికాదు.

''చిన్నప్పుడు అయ్య సంపాదించి పెడుతుంటే తెలిసేది కాదు. ఇప్పుడా సుకమంతా 'కల'లాగా ఉన్నది బాబుగారూ!'' అన్నాడు శంకరయ్య ఆ రోజుల్ని జ్ఞాపకం చేసుకొంటూ.

తండ్రి చనిపోయాక, అంతా అయోమయంగా ఉన్న శంకరయ్య కొంతకాలం పాటు ఇంట్లో వున్న పాత సామాను అమ్ముకుతిన్నాడు. చదువు లేకా చేతిలో ఏ పనీ లేకా అతను దినపస్తులు చేసిన సందర్భాలు కూడా చాలా వున్నాయ.

''మా అయ్య చాలా పాడు పన్లు చేశాళ్ళండి. అందులో నాకు పెళ్ళి చేయడం వొకటి, ఈ పెటాకులు యేగక పోయినట్లయితే నాకీ గొడవలన్నీ ఉండేవి కాదండి. బతికినా చచ్చినా వొక్కణ్ణి. తిన్నా తినకపోయినా దర్జాగా కాలం గడిచిపోయేది. ఈ లంపటం ఉండడంతో నా పని ఉ రేసుకున్నట్లయిదండి. పెళ్లాం అన్నది ఉన్న తరవాత పిల్లలు పుట్టుకురారా దొరగారూ! ముగ్గురు పిల్లలున్నారండి. వీళ్ళ పొట్టలు నింపలేక ఛస్తున్నానండీ''. అన్నాడు శంకరయ్య.

కొంతకాలంపాటు గాలికి తిరిగిన శంకరయ్య ఆఖరుకు వో హోటల్లో క్లీనరుగా కుదిరాడు. రెండు పూటలా భోజనం, రెండుసార్లు కాఫీ టిఫెనూ యిచ్చి నెలకు పదిహేను ఇచ్చేవారుట. ఓ ఏడాది పాటు అక్కడే పనిచేశాడు. జీతాలు పెంచమనీ, పనిగంటలు తగ్గించమనీ, పనివాళ్ళంతా సమ్మె చేసినప్పుడు శంకరయ్య కూడా వాళ్ళతో చేరాడు. వారం రోజులో, పది రోజులో సమ్మె జరిగింది. జీతాలు పెరిగినా పెరక్కపోయినా చేస్తున్న వుద్యోగం కాస్తా వూడిపోయింది. యింకెక్కడికెళ్లినా పని దొరకలేదు. ''యూనియన్'' వాళ్ళనడిగితే ''ఇదిగో అదిగో'' అంటూ తిప్పి తిప్పి చంపారే తప్ప - యింకో చోట పని చూపించలేదు.

''నాకసలు గొడుగులు బాగు చేయడం చాతకానేకాదండి. ఆకలి- నాకీ పని నేర్పింది. యిందులో పెద్దగా నేర్చుకోవలసింది కూడా ఏమీ లేదనుకోండి. కాస్త బుర్రను ఉపయోగిస్తే, ఎక్కడ

చెడిపోయిందో, దాన్నెలా బాగు చేస్తే సరిపోతుందో తెలిసిపోతుందండి. మొదట మొదట నాకూ తెలియలేదు. క్రమంగా అన్నీ నేర్చుకొన్నాను.'' అన్నాడు శంకరయ్య.

ఇప్పుడతని దగ్గర పాత గొడుగు చువ్వలు, గుబ్బలు, కుప్పెలు, వుక్కుతీగలు, కట్లు, అవర్లు, పొన్నులు, రింగులు చాలా వున్నాయి. రకరకాల గొడుగుల్ని చూస్తూనే వాటి జబ్బేమిటో సులభంగా గ్రహించగలడు. కొత్త అవరు వేస్తే, దాని ఖరీదు కాక అర్ధరూపాయి తీసుకొంటాడు. చువ్వలకు గుడ్డకూ కూడా రూపాయి తీసుకుంటాడు. గొడుగు చివర కొత్త పొన్ను బిగిస్తే ముప్పావలా. పాతదయితే 30, 40 పైసలూ తీసుకుంటాడు.

''బెట్టు చెడిపోయిందనుకోండి పాతది బాగుచెయ్యమని ప్రాణం తీస్తారు. దానికేమో టెంపరు వుండదు. కొత్తది వేసుకోమని సలహాయిస్తా. కొంతమంది వినరు. ఇహ చేసేదిలేక జవగారుతో పాతదాన్నే వొంచి, అప్పటికప్పుడు పనిచేసేలాగా అమర్చుతా, కానీ, అలాంటి పన్లు చేసి, పాడు పేరు తెచ్చుకోవడం నాకు యిష్టం వుండదండి. చువ్వలు 'కామ' చుట్టూ సర్ది ఉక్కుతీగ బిగించి జవ జవలాడే జాయింట్ల దగ్గర రివిట్లు బిగించి తుప్పుపోయేలా మెరుక్కాగితం రుద్ది అంతా అవల్‌రైట్‌గా చేస్తాననుకోండి. మూడు రూపాయలవుతుంది. 'ఈ ముండమోపి గొడుక్కి మూడా?' అంటారు. పని చూడరు బాబుగారూ, 'చవక' చూస్తున్నారు జనం''. అన్నాడు శంకరయ్య.

ఎండాకాలంలో, కాస్త గిరాకీ ఉంటుందిట. వానాకలంలోనే మంచి సీజను వుంటుందన్నాడు శంకరయ్య- అదీ - రెండు మూడు జల్లులు పడిన తరువాత గానీ పాత గొడుగులన్నీ మూలల్నుంచి తియ్యరని చెప్పాడు శంకరయ్య.

ఒక్కచోటనే కూచుని పనిచేస్తాడు. అలా కూచున్న చోటికి, ఖాతాదార్లు రాకపోతే తనే వీధి వీధీ, ఇల్లిల్లూ తిరుగుతానన్నాడు. మైలు, రెండు మైళ్ల లోపలయితే నడిచే వెడతాడు. మరీ దూర ప్రాంతాలకు వెళ్ళాలనుకున్నప్పుడు అద్దె సైకిల్ మీద పోతాడు.

''రోజుకు ఎంత సలీసుగా చూచుకొన్నా ఏడెనిమిది దాకా కళ్ళ చూస్తానండి. ఈ సీజను కాస్త దాటితే, మళ్ళా దినపస్తులేనండి.''

శంకరయ్య భార్య మరీ రోగిష్టిమనిషి, అయినా అయిదిళ్ళు వొప్పుకొని పాచిపనీ, అంట్లపనీ చేస్తున్నది. చద్దీబొద్దీ మిగిలితే ఇంటికి తెస్తుంది. వాటితో బాటు తన సంపాదనను కూడా కలిపి నీళ్లా మంటాకాలం గడుపుతున్నాడు శంకరయ్య.

అతన్ని మీరు చూడాలనుకొంటున్నారా? విశాఖపట్నంలో మహారాణి పేటలో గాని, దూడావారి వీధిలో గానీ, మార్కెట్ దగ్గరగానీ, యూనివర్శిటీరోడ్డు వారగానీ ఇన్ని పాత గొడుగుల్ని ముందేసుకొని, వాటిని బాగు చేస్తూ కనపడతాడు.

ఎన్నో వేలమందికి, ఎండా వానల బాధ లేకుండా, గొడుగుల్ని బాగు చేసి యిస్తున్న శంకరయ్య మిటమిటలాడే ఎండకూ, జోరున కురిసేవానకూ; ఏ పాత చూరు చాటునో తలదాచుకోవడం, మన సమసమాజ స్థాపన కొకమచ్చుతునక.